

అంబరాన్ని తాకేలా..

భక్తుల కోలాహలం.. అమ్మవార్లు, స్వామివార్ల ఊరేగింపులు.. నృత్యాలు.. వాయిద్యాలతో చొల్లంగి సంబరాలు అంబరాన్ని తాకాయి.


8లో



వివాహిత మృతి

పందలపాక గ్రామంలో వివాహిత కురుపూడి లలితేశ్వరి(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బంధువుల వివరాల మేరకు ఓ సంచుల గోడౌన్లో లలితేశ్వరి గుమస్తాగా పనిచేస్తోంది.

డెల్టా కాలువలకు 9,355 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,355 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 1,755, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఆంధ్రప్రదేశ్ శకటానికి మూడో స్థానం హర్షణీయం



ఏటికొప్పాక బొమ్మల శకట ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

అంబాజీపేట: దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈ నెల 26న నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటానికి మూడో స్థానం దక్కడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శకటం రూపకల్పనలో కీలకపాత్ర వహించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్, అధికారుల బృందానికి, ఏటికొప్పాక కళాకారులకు, వరుసగా మూడోసారి శకటం వద్ద ప్రదర్శన చేసిన ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు, అతని బృందానికి గంగలకుర్రు అగ్రహారం శివ కేశవ యూత్ బుధవారం అభినందనలు తెలిపింది. ఏటికొప్పాక బొమ్మలతో పాటు, శకటానికి ఇరువైపులా నృత్యం చేసిన కళాకారుల బృందానికి ప్రత్యేకంగా అభినందించింది. ఓటింగ్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ శకటం మూడో స్థానం పొందేందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపింది.

విఘ్నేశ్వరునికి రూ.1.53 లక్షల ఆదాయం



అయినవిల్లి: పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి బుధవారం ఒక్కరోజు వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు తదితర వాటి ద్వారా రూ.1,52,952 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో ఇద్దరు దంపతులు, లఘున్యాస అభిషేకాల్లో 46 మంది దంపతులు, స్వామివారి శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 18 మంది దంపతులు, నలుగురు భక్త దంపతులకు స్వామి వేదాశీర్వచనం పలికారు. ఆరు నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,350 మంది స్వీకరించారు.

31 వరకు 'టిస్' ఎడిట్ ఆప్షన్ ఎనేబుల్

రాయవరం: టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టిస్)ను ఎడిట్ చేసుకునేందుకు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో గడువును మరో రెండు రోజులు పొడిగించారు. ఉపాధ్యాయులు ఇప్పటికే టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఎవరైనా వారి వివరాలను నమోదు చేసుకోవడంలో పొరపాట్లు చేస్తే, వాటిని సవరించుకోవడానికి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో టీచర్ పర్సనల్ లాగిన్‌లో ఎడిట్ చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. ఈ అవకాశం మరో రెండు రోజుల పాటు ఉంటుంది. ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా వారి పుట్టిన తేదీ, డేట్ ఆఫ్ ఫస్ట్ అపాయింట్‌మెంట్, డేట్ ఆఫ్ జాయినింగ్ ఇన్ ద ప్రజెంట్ క్యాడర్, డేట్ ఆఫ్ జాయినింగ్ ఇన్ దిస్ ప్రజెంట్ స్కూల్, అకడమిక్ అండ్ ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ తదితర వివరాలను సర్వీస్ రిజిస్టర్ ప్రకారం సరిచేసుకోవాల్సి ఉంది. జిల్లాలో ఉన్న 5,400 మంది ఇప్పటికే వారి వివరాలను టిస్‌లో నమోదు చేసుకున్నారు. వివరాలను ఎడిట్ చేసుకున్న ఉపాధ్యాయులతో పాటు, అందరు ఉపాధ్యాయులు ఈ నెల 31లోపు కన్ఫర్మేషన్‌ను పూర్తి చేయాల్సి ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు.

మోగిన నగారా.. కూటమికి గాబరా





- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- కూటమి గెలుపునకు చంద్ర'గ్రహణం'
- వాగ్దానాలు అమలు చేయని 'బాబు'
- వెంటాడుతోన్న ప్రజాగ్రహం
- ఏడు నెలల పాలనా వైఫల్యం కొంప ముంచనుందా?
- ఆర్‌ఓగా ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి
- ఏఆర్వోలుగా జిల్లా రెవెన్యూ అధికారులు
- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 3,15,261 మంది ఓటర్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మండలిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగనున్న ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐ.వి) పదవీ కాలం వచ్చే మార్చి 29తో ముగియనుంది. ఖాళీ కానున్న ఈ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చేసింది. ఎన్నికలకు వచ్చే నెల 3న నోటిఫికేషన్ వెలువడనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నియమితులయ్యారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని మొదటి నుంచి అనుకుంటున్నారు. కానీ ఏలూరు కలెక్టర్ ఆర్‌ఓగా నియమితులయ్యారు. ఆర్వో పరిధిలో ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్‌ఓ)గా ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. నామినేషన్లు మొదలు పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు అన్నింటినీ ఆర్వోగా నియమితులైన ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పర్యవేక్షించనున్నారు.

ధనబలంతో ముందుకు...

సహజంగా పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరగాలని ప్రతి గ్రాడ్యుయేట్ ఆశిస్తాడు. కానీ ఈసారి అందుకు పూర్తి భిన్నంగా రాజకీయం, ధనబలంతో ముడిపడే ఎన్నికలుగా మార్చేశారు. ఇందుకోసం మూడు నెలలు ముందు నుంచే ఎక్కడికక్కడ పార్టీ నేతల ద్వారా పట్టభద్రుల ఓటర్ల నమోదు కోసం పెద్ద క్యాంపెయిన్ నిర్వహిస్తూ వస్తున్నారు. మండల, గ్రామాల వారీగా పార్టీ నేతలతో మాట్లాడించి ఓట్ల నమోదు చేయించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయంగా కలుషితం చేశారని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. ఈ ఎన్నికలలో అధికార పార్టీలో కూటమి తరఫున పోటీ చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్ ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. పార్టీ అభ్యర్థినైతే కూటమి ప్రకటించేసింది. కానీ ఆ ప్రకటన చేసిన దగ్గర నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలకు భయం వెంటాడుతోంది.

ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్	:	ఫిబ్రవరి 3
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ	:	ఫిబ్రవరి 10
నామినేషన్ల పరిశీలన	:	ఫిబ్రవరి 11
నామినేషన్ల ఉపసంహరణ	:	ఫిబ్రవరి 13
పోలింగ్ తేదీ	:	ఫిబ్రవరి 27
పోలింగ్ సమయం	:	ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు
ఓట్ల లెక్కింపు	:	మార్చి 03

ప్రజా వ్యతిరేకత కొంప ముంచుతుందా?

సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు లెక్కలేనన్ని హామీలు గుప్పించారు. కూటమి నేతలు చెప్పిన మాటలు వాస్తవ రూపం దాల్చుతాయనే నమ్మకంతో ప్రజలు ఓటేసి గద్దె నెక్కించారు. అధికారంలోకి వచ్చి అప్పుడే ఏడు నెలలు గడచిపోయినా 99 శాతం హామీలను అటకెక్కించేశారు. చివరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేమంటూ చంద్రబాబే స్వయంగా చేతులెత్తేసి నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడ్రస్సే లేకుండా చేశారు. తల్లికి వందనం ఊసే లేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి మాటే లేకుండా చేశారు. మహిళలను ఉచిత బస్సు ఎక్కించనే లేదు. రైతులకు పెట్టుబడి సాయం మాట నిలబెట్టుకోలేదు. ఇంటిలో ఎంత మంది ఉంటే అంత మంది ఆడపిల్లలకు ప్రతి నెలా రూ.1,500 ఖాతాలో వేస్తానని చెప్పి దగా చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లకు తిరిగి ఉద్యోగాలు కల్పించి రూ.5,000 ఉన్న వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని చెప్పుకొచ్చారు. ఏరు దాటాక ఓడ మల్లన్నను బోడి మల్లన్న అన్నట్టు గద్దెనెక్కాక చంద్రబాబు హామీల్లో ఒక్క పింఛన్ పెంపు తప్ప మరే ఒక్క హామీని అమలు చేయలేదు. పింఛన్ నగదు పెంచారు తప్పితే ఇప్పుడు పునఃపరిశీలన అంటూ పింఛన్ల సంఖ్యను కుదించేసే ఎత్తులు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చేతిలో సొమ్ము లేక ఉమ్మడి తూర్పులో ప్రజలు సంక్రాంతి పండగ కూడా సాదాసీదాగా చేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఏడు నెలల పాలనా వైఫల్యాలు ఎక్కడ తన మెడకు చుట్టుకుంటాయోననే భయం కూటమి ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన రాజశేఖర్‌ను వెంటాడుతోంది. చంద్రబాబు అండ్ కో ఇచ్చిన హామీలు అమలైతే లబ్ధి పొందే అన్ని కేటగిరీల్లోను పట్టభద్రుల సంఖ్య గణనీయంగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వంపై పెల్లుబుకుతోన్న ప్రజావ్యతిరేకత పట్టభద్రులను కచ్చితంగా ప్రభావితం చేస్తుందనే చర్చ కూటమి నేతల మధ్యే జరుగుతుండటం గమనార్హం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఊరూరా తిరిగి పట్టభద్రుల ఓట్లను జాయిన్ చేయించుకున్నా కూటమి సర్కార్‌పై ఉన్న ప్రజా వ్యతిరేకత కొంప ముంచుతుందని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు.

నియమావళి పాటించాలి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అందరూ పాటించాలి.

– కె.వెట్రిసెల్వి, జిల్లా కలెక్టర్, ఏలూరు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

కాకినాడ జిల్లాలో ఎక్కువ మంది ఓటర్లు

గత నెల 30న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గానికి అర్హులైన ఓటర్లు 3,15,261 మంది ఉన్నారని లెక్క తేల్చారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 70,343 మంది ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో 4,664 మంది ఉన్నారు. కాగా, పెరిగిన ఓటర్లకు అనుగుణంగా ఐదు జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలను కూడా పెంచారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఏఎస్ఆర్	12	2,839	1,825	0	4,664
కోనసీమ	95	37,069	27,256	2	64,327
తూర్పుగోదావరి	82	36,714	26,725	2	63,441
ఏలూరు	62	24,895	17,699	8	42,602
కాకినాడ	96	42,437	27,899	7	70,343
పశ్చిమగోదావరి	93	39,780	30,103	1	69,884
మొత్తం	440	1,83,734	1,31,507	20	3,15,261

కేదారిలంక ర్యాంపులో ఇసుక దందా

- ఉచితం మాటున టీడీపీ, జనసేన నేతల అక్రమార్జన
- ట్రాక్టర్లతో పాటు, భారీ వాహనాల్లో తరలింపు
- కూలీల స్థానే యంత్రాలతో తవ్వకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కేదారిలంక ర్యాంపులో యంత్రాలతో జరుపుతున్న ఇసుక తవ్వకాలు



కేదారిలంక గ్రామం మీదుగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

కపిలేశ్వరపురం: ఆహ్లాదకరమైన కేదారిలంక గ్రామం కూటమి నేతల అక్రమాలకు నిలయంగా మారింది. జిల్లా పర్యాటక కేంద్రంగా విలసిల్లిన ధనమ్మ మర్రి గ్రామంలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఉచిత ఇసుక పేరుతో అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. కూలీలకు ఉపాధి మాటున యంత్రాల సాయంతో భారీ వాహనాల్లో ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదంతా చీకటిమాటున కాకుండా బహిరంగంగానే సాగుతున్నప్పటికీ, తహసీల్దార్ నుంచి క్షేత్ర స్థాయి ప్రభుత్వ సిబ్బంది వరకూ చేష్టలూడుతున్నారు. కనీసం ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయకుండా మిన్నకుంటున్నారు.

వారం రోజుల క్రితం కేదారిలంక ర్యాంపులో పరిసర గ్రామాల వినియోగార్థం ఉచిత ఇసుక విధానంలో తవ్వకాలకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. దాన్ని సాకుగా చూపి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు అక్రమాలకు బాటవేశారు. పటిష్టమైన బాటను నిర్మించి జేసీబీ యంత్రాలను సమకూర్చుకుని ఇసుకను లోడు చేస్తున్నారు. అక్రమాలకు నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన నాయకుల అండ పుష్కలంగా ఉందన్న వాదన ఉంది. ర్యాంపులో ట్రాక్టర్లకు బదులు లారీలను ఎందుకు అనుమతి ఇస్తున్నారని ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు కొందరు చెబుతున్నారు. తహసీల్దార్ చిన్నారావు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా కనీసం పట్టించుకోలేదని ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ వాపోయారు. చివరకు చేసేది లేక ఈ నెల 27న కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేశామన్నారు. సోమవారం ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటారని ఆశించామని, మంగళవారం ఉదయమే ర్యాంపులో లారీల్లో ఇసుకను అక్రమంగా తరలించారన్నారు.

ఉచితంగా ఇసుకను అందించాల్సి ఉన్నప్పటికీ, ట్రాక్టర్ రూ.1,200కి విక్రయిస్తున్నారు. లారీలకు ఎలాంటి అనుమతి లేకపోయినప్పటికీ, రోజుకు సుమారు 25 లారీల చొప్పున ఇసుకను లోడు చేస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 వరకూ ట్రాక్టర్లలో ఇసుకను విక్రయిస్తున్నారు. పెద్ద మొత్తంలో టీడీపీ, జనసేన నాయకులు వారి స్థాయిని బట్టి దండుకుంటున్నట్టు సమాచారం. ర్యాంపు నుంచి యంత్రాలతో ఇసుకను లోడు చేసి తరలిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నప్పటికీ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, కనీస చర్యలు తీసుకోకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళలోనూ తవ్వకాలు జరుపుతున్నారని, భారీ వాహనాల రాకపోకలనతో భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ర్యాంపులో సిబ్బందిని నియమించాం



ఉచిత ఇసుక విధానంలో ట్రాక్టరులో స్థానిక అవసరాల మేరకు ఇసుక తరలింపునకు అనుమతి ఉంది. అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ సిబ్బందిని ర్యాంపు వద్ద విడతల వారీగా ఏర్పాటు చేశాం. అక్రమాలు జరుగుతున్నట్టు నా దృష్టికి రాలేదు.

– చిన్నారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం

కుష్ఠును నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యం

కలెక్టర్ మహేష్‌కుమార్



కుష్ఠు వ్యాధిపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ప్రాణాంతకం కానప్పటికీ కుష్ఠు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్పర్శ కుష్ఠు వ్యాధి ప్రచార కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో అంతంతమాత్రంగా ఉన్న ఈ వ్యాధి తీవ్రత ఇటీవల కాలంలో పెరుగుతున్నట్లు వైద్య శాఖ గుర్తించిందని, దీంతో అప్రమత్తమైన జాతీయ ఆరోగ్య మిషన్ కుష్ఠు వ్యాధిగ్రస్తులు, ఆ లక్షణాలు కలిగిన వారి వివరాలను తెలుసుకోవాలని సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా 14 రోజుల పాటు ఇంటింటా లెప్రసీ(కుష్ఠు) ప్రచార కార్యక్రమం చేపట్టారన్నారు. జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో ఈ ప్రచార కార్యక్రమం ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతుందన్నారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. ఈ పథకం పురోగతిపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. సోలార్ ప్యానళ్ల కోసం తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారులు రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఇంటి కప్పుపై ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. మిగిలినది బ్యాంకు రుణం పొందవచ్చన్నారు. సొంత అవసరాలు పోను, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ స్వామినాయుడు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం పి.కేశవవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రిడ్జి కోర్సు తరగతులు

రాయవరం: పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి బ్రిడ్జి కోర్సు తరగతులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ, కోనసీమ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. గురువారం నుంచి తరగతులు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో నేరుగా కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించాలని సూచించారు. బ్రిడ్జి కోర్సులో చేరదల్చుకున్న వారు 87907 98431, 94946 88516 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కుష్ఠు కట్టడించేలా..



కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

- ఫిబ్రవరి 13 వరకు లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు
- జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్ధారణ కేసులు 60
- నేడు ప్రపంచ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం

రాయవరం: అనారోగ్య సమస్యలతో పాటు, అంగవైకల్యానికి దారి తీసే కుష్ఠు వ్యాధి విస్తరించకుండా వైద్యారోగ్య శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. కుష్ఠు బాధితులకు వైద్య సాయం అందించడమే కాకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తోంది. ఏటా రెండుసార్లు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో లెప్రసీ కేసుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నారు. జూన్-జూలై, డిసెంబర్-జనవరి నెలల్లో ఈ సర్వేను చేపడుతున్నారు. అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, చికిత్స అందించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

లక్షణాల గుర్తింపు


మైకో బాక్టీరియం లెప్రే అనే సూక్ష్మ జీవి కారణంగా కుష్ఠు వ్యాధి వస్తోంది. చర్మంపై స్పర్శలేని మచ్చ రాగి రంగులో ఉంటుంది. ఆ ప్రదేశంలో చెమట కూడా పట్టదు. శరీరంలో అధికంగా చర్మం, నరాలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. అరికాళ్లు, అరిచేతులు, గోళ్లు మినహా, శర్మంపై ఎక్కడైనా రావచ్చు. వ్యాధి వచ్చిన ప్రదేశంలో వెంట్రుకలు రాలిపోతాయి. నిర్లక్ష్యం చేస్తే కాళ్లు, చేతులు వైకల్యం పొందడంతో పాటు, ముఖం, చెవి వద్ద వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుంది.

చికిత్స ఇలా..

ఈ వ్యాధికి రెండు రకాల చికిత్సను అందిస్తారు. మొదటిది పాసిబేసిలరి(పీబీ). వ్యక్తి శరీరంలో 1 నుంచి 5 మచ్చల వరకు ఏర్పడడం, ఒక నరానికి మాత్రమే వ్యాధి సోకితే, ఆరు నెలల చికిత్స అందిస్తారు. ఐదు లేక అంతకంటే ఎక్కువ మచ్చలు, రెండు లేక అంతకంటే ఎక్కువ నరాలకు వ్యాధి సోకితే మల్టిబాసిలరి(ఎంబీ) అంటారు. దీనికి 12 నెలలు చికిత్స తీసుకోవాలి. నరాలకు క్రిమి చేరక ముందే పూర్తి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చు. రోగి పూర్తిగా కోలుకున్నా, జీవితాంతం జాగ్రత్తలు పాటించాలి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 60 కుష్ఠు వ్యాధి నిర్ధారణ కేసులున్నాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు వీటిని గుర్తించారు. వీటిలో పాసిబాసిలరీ కేసులు 22 ఉండగా, మల్టీబాసిలరి లెప్రసీ కేసులు 38 ఉన్నాయి.

13 వరకు అవగాహన పక్షోత్సవాలు

గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఏటా కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తారు. గురువారం నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను నిర్వహించనున్నారు. వ్యాధిపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది.



కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల పోస్టర్

తీవ్రత ఆధారంగా చికిత్స



వ్యాధి లక్షణాలు గుర్తించిన వారికి తీవ్రత ఆధారంగా ఆరు, 12 నెలల పాటు చికిత్సను అందిస్తున్నాం. వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించడమే ప్రభుత్వం ముందున్న లక్ష్యం. వైద్యారోగ్య శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. వ్యాధి నివారణకు జిల్లాలో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. తొలి దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నియంత్రించవచ్చు.

– డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	280

క్లుప్తంగా

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్టు

అమలాపురం టౌన్: పట్టణ సావరం బైపాస్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఆరుగురు యువకులను పట్టణ సీఐ పి.వీరబాబు బుధవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. పాండిచ్చేరి యానానికి చెందిన కనపర్తి వెంకటదుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజులు, సాపే వంశీకృష్ణ, కర్రి దుర్గాప్రసాద్, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన బొంతు నవీన్‌కుమార్, ఇదే మండలం నల్లమిల్లికి చెందిన కోటిపల్లి నవీన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, అమలాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 600 గ్రాముల గంజాయి, 4 మోటార్ బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తమకు అందిన సమాచారంతో ఈ దాడులు చేసినట్టు చెప్పారు.

అదుపుతప్పి హైవేపై కారు బోల్తా

నలుగురికి స్వల్ప గాయాలు

తుని రూరల్: జాతీయ రహదారిపై తుని మండలం గవరయ్య కోనేరు సమీపంలో లారీ ఢీకొనడంతో అదుపుతప్పిన కారు సెంటర్ డివైడర్‌పై బోల్తా పడింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు, మంగళవారం హైదరాబాద్‌లో బయలుదేరి, బుధవారం ఉదయం కాకినాడకు చేరుకుని, అక్కడి నుంచి తుని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెనుక వస్తున్న లారీ ఢీకొనడంతో కారు బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురు మహిళలు, పురుషుడు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. స్వల్ప గాయాలు కావడంతో క్షతగాత్రులు ఆస్పత్రికి వెళ్లేందుకు తిరస్కరించి, అదే కారులో వెళ్లిపోయారు. దీనిపై ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సాంబమూర్తి నగర్‌కు చెందిన నేరెళ్ల నవ్య(29) వ్యక్తిగత కారణాలతో మంగళవారం పురుగు మందు తాగింది. ఆమెను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



గ్రామదేవతలు, వీరభద్రుల ఊరేగింపు



ప్రత్యేకాలంకరణలో చొల్లంగి బాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామివారు



ప్రత్యేకాలంకరణలో రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామివారు



కోలాహలంగా అప్పన్నెద్దులను తీసుకొస్తున్న భక్తులు

అంబరాన్ని తాకేలా..

- అంగరంగ వైభవంగా చొల్లంగి తీర్థం
- పోటెత్తిన భక్తజనం
- తుల్యభాగలో పవిత్ర స్నానాలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సంగమేశ్వరుడు, సోమేశ్వరుడు
- ఆకట్టుకున్న అప్పన్నెద్దులు
- అలరించిన జంగమదేవరులు



చొల్లంగి తుల్యభాగ నదిలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు



కాకినాడ–యానాం రహదారిలో భక్తులతో కిటకిటలాడిన చొల్లంగి

తాళ్లరేవు: భక్తుల కోలాహలం.. అమ్మవార్లు, స్వామి వార్ల ఊరేగింపులు.. నృత్యాలు.. వాయిద్యాలతో చొల్లంగి సంబరాలు అంబరాన్ని తాకాయి. చొల్లంగి అమావాస్య పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చొల్లంగి తీర్థ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు తుల్యభాగ నదిలో పవిత్ర స్నానాలాచరించి, నదీతీరాన ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి, చంద్ర ప్రతిష్ఠిత లింగమైన రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామివార్లను భక్తులు దర్శించుకుని తరించారు. జిల్లా నలుమూలల నుంచే కాక, ఇతర జిల్లాల నుంచి సైతం తరలివచ్చిన భక్త జనంతో చొల్లంగి జన సంద్రంగా మారింది. భక్తులకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామివారికి ఆలయ అర్చకులు వెలవలపల్లి భవానీ శంకర్ శర్మ, సత్య చిరంజీవి నేతృత్వంలో అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.

వీరభద్రులు, అమ్మవార్ల ఊరేగింపు

పలు గ్రామదేవతలను, వీరభద్రులను ఊరేగింపుగా తీసుకెళ్లి పవిత్ర స్నానాలు చేయించారు. మట్లపాలెం గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారిని గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. వీరభద్రులను సైతం ఊరేగింపుగా తరలించారు. తీర్థంలో జంగమదేవరులు అలరించారు. గరగ నృత్యాలు, వీరభద్రుని సంబరాలు, పూనకాలతో సందడిగా మారింది. వివిధ రకాల స్టాళ్లతో చొల్లంగి గ్రామం కిటకిటలాడింది.

అప్పన్నెద్దుల ఊరేగింపు కోలాహలం

వేంకటేశ్వరస్వామివారి ప్రతిరూపాలుగా భావించే అప్పన్నెద్దులను సుందరంగా అలంకరించి, యువకులు ఉత్సాహంగా తీర్థానికి తీసుకువచ్చి, పవిత్ర తుల్యభాగ నదిలో స్నానాలు చేయించారు. అనంతరం స్వామివార్ల దర్శనానికి తీసుకువచ్చారు. అప్పన్నెద్దులు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదవ సోదరులు భజనలు చేస్తూ అప్పన్నెద్దుల వెంట ఉత్సాహంగా పరుగులు తీశారు. ఉప్పలంక మొండి నుంచి చొల్లంగి గ్రామంలోని సోమేశ్వరస్వామివారి ఆలయానికి చేరుకుని, కోల సంబరాలు నిర్వహించారు.

భారీ అన్నదానం

చొల్లంగిలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన అభయాంజనేయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తీర్థానికి భారీగా వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో కమిటీ ప్రతినిధులు భారీ అన్నదానం నిర్వహించారు. ట్రాఫిక్ మళ్లింపుతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



మొండిలోని స్నానాల రేవుకు తీసుకొస్తున్న అప్పన్నెద్దు



చొల్లంగి తీర్థానికి తీసుకొచ్చిన వీరభద్రుని ప్రభలు, గరగలు



సంగమేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఉప్పలంక శివారు మొండి రేవు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

వేలాదిగా పుణ్యస్నానాలు

- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- యానాం రోడ్‌లో భక్తుల రద్దీ

కరప: కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక శివారు మొండి వద్ద బుధవారం సముద్ర తీరాన చొల్లంగి అమావాస్య తీర్థం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానాలు చేశారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలు కిటకిటలాడాయి. మొండిలోని బాలా త్రిపుర సుందరి సమేత సంగమేశ్వర స్వామి, చొల్లంగిలోని రాజరాజేశ్వరీదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారాములు, ఆంజనేయస్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. సంగమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు దొంతుకుర్తి వెంకటకృష్ణశాస్త్రి, సోమేశ్వరస్వామి ఆలయంలో అనువంశిక అర్చకులు వెలవపల్లి భవానీశంకరశర్మ, సత్యచిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానమాచరించి సంగమేశ్వరస్వామిని, భైరవస్వామిని, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. నడకుదురు–గురజనాపల్లి రోడ్, కాకినాడ–యానాం రోడ్డు భక్తులతో రద్దీగా మారింది. కరప, పరిసర మండలాల నుంచి వీరభద్రుని గద్దె నుంచి ప్రభలను, గరగలను తలపై ఎత్తుకుని వచ్చి, భక్తిప్రపత్తులతో స్నానాలు చేశారు. పలు గ్రామాల నుంచి అప్పన్నెద్దులను కోల సంబరం పాటలతో తోలుకొచ్చి, సముద్ర స్నానం చేయించి, సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాగర సంగమమైన మొండి వద్ద మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ ఇక్కడి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆయన వంశీకులు, దేవదాయ శాఖ ఏటా చొల్లంగి తీర్థం జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్షేత్రం నుంచే సప్తసాగర యాత్ర ప్రారంభించబడి, కోరంగి, నాసంగితిప్ప, తీర్థాలమొండి, బ్రహ్మసమేధ్యం, రామేశ్వరం



చొల్లంగిలో చంద్రుడు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామి

ఆలయాల తీర్థాలు కొనసాగి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి తీర్థంతో ముగుస్తుంది. వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, దేవదాయ శాఖ ఏసీ కె.విజయలక్ష్మి భక్తులకు ప్రత్యేక



ఉప్పలంక శివారు మొండిలోని బాలాత్రిపుర సుందరి సమేత సంగమేశ్వరస్వామి

ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్నానాల రేవు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. కరప పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. మొండి వద్ద బాలా త్రిపురసుందరి సమేత సంగమేశ్వర స్వామివారిని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 80 వేల మంది భక్తులు తరలివచ్చారు.

ఎమ్మెల్యే తనయుని సేవలో..

మొండి వద్ద చొల్లంగి అమావాస్య తీర్థం రోజున కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్ ఆలయానికి రావడంతో అధికారులు, స్థానిక నాయకులు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ఆలయం లోపలకు తీసుకెళ్లి, పూజలు చేయించి, వేద పండితులతో ఆశీర్వాదం చెప్పించారు. వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ఏసీ కె.వి జయలక్ష్మి, స్థానిక నాయకులు తమ స్వామిభక్తిని చాటుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తన భర్త సత్తిబాబుతో కారులో వస్తుంటే, పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే తనయుడి కారును పంపించి, ఎంపీపీ కారును పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. కాకినాడ రూరల్ సీఐ, కరప ఎస్సై స్పందించి ఎంపీపీని పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

చొల్లంగి పుణ్యస్నానాల్లో అపశ్రుతి

సముద్రంలో మునిగి వ్యక్తి మృతి

అల్లవరం: చొల్లంగి అమావాస్య సందర్భంగా మండలంలోని నక్కారామేశ్వరం సముద్ర తీరంలో బుధవారం అపశ్రుతి చోటుచేసుకుంది.. ఓ వ్యక్తి సముద్రంలో స్నానం చేస్తూ మునిగిపోయాడు. ఈ ఘటనలో అయినవిల్లి మండలం నల్లచెరువుకు చెందిన బొడ్డు వెంకటసుబ్బారావు(47) మృతిచెందాడు. కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన వెంకటసుబ్బారావు, అతని సోదరుడు రమేష్ సముద్రంలో స్నానాలు చేసేందుకు దిగారు. కెరటాల ఉధృతికి వెంకటసుబ్బారావు, రమేష్ కొట్టుకుపోగా, వెంకటసుబ్బారావు గల్లంతయ్యాడు. కొట్టుకుపోతున్న రమేష్‌ను స్థానికులు కాపాడారు. కాసేపటికే వెంకటసుబ్బారావు మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై హరీష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వంచించిన భర్త, అత్తలపై పోక్సో కేసు

వివరాలను వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



పెద్దాపురం: మైనర్ బాలికను మోసం చేసి, ఆమె అనారోగ్య పరిస్థితికి కారణమైన వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం బంగారంపాలెం గ్రామానికి చెందిన ఎరుపల్లి అంజలి(17)కి పెద్దాపురం పట్టణానికి చెందిన ధరిణికోట చందుతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారి, వారు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. దీనిపై అనకాపల్లి పీఎస్‌లో ఆరు నెలల క్రితం పెద్దలు ఫిర్యాదు ఇవ్వగా, ఫ్యామిలీ కౌన్సెలింగ్ తర్వాత ఇద్దరి ఇష్ట ప్రకారం అక్కడే కాపురం చేశారు. గతేడాది డిసెంబర్ 20న పెద్దాపురం ఎన్టీఆర్ కాలనీలో అపార్ట్‌మెంట్‌కు మకాం మార్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా డిసెంబర్ 28న అస్వస్థతతో ఉన్న అంజలిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రి సమాచారం మేరకు పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఆమె కాకినాడ జీజీహెచ్‌లో ఇచ్చిన వాగ్మూలం ప్రకారం, ఆమె వయస్సు 20 ఏళ్లని, భర్తపై మనస్థాపం చెంది చీమల మందు తీసుకున్నట్టు తెలిపింది. పెద్దాపురం పోలీసులు విచారణ చేసి, మేజిస్ట్రేట్ ఎదుట డీడీ చేయించాక, ఆమె కాకినాడ నుంచి బంగారమ్మపాలెం వెళ్లిపోయింది. ఆ సమయంలో తన అత్త వ్యభిచారం చేయాలంటూ అంజలిని ప్రోత్సహించినట్టు పెద్దాపురం పోలీసులకు చెప్పలేదు. ఈ నెల 25న పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు విశాఖపట్నం విమ్స్ ఆస్పత్రి నుంచి ఎరుపల్లి అంజలి తల్లి దుర్గమ్మ ఇచ్చిన వాగ్మూలం మేరకు, అంజలి మాట్లాడలేని స్థితిలో ఉన్నందున, దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాలిక ఆ స్థితిలో ఉండడానికి కారణమైన చందు, నీలిమపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని, నిందితులెవరైనా ఉపేక్షించేది లేదని డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. ఈ సమావేశంలో సీఐ కృష్ణభగవాన్, ఎస్సై మౌనిక ఉన్నారు.

మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి
- బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపుల వ్యవహారం

కరప: కాకినాడ జిల్లా కరప మండలం వాకాడలోని మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి, మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని మండల విద్యాశాఖాధికారులను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఇక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థినిపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు రావడం దురదృష్టకరమన్నారు. విద్యాశాఖాధికారులు ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో సంబంధిత వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు.

సస్పెన్షన్ వేటు

వాకాడలో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు వచ్చిన వార్తలపై జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ బుధవారం వాకాడ పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. ఒక విద్యార్థినినే కాకుండా, ఐదో తరగతి విద్యార్థినులందరూ కూడా ఎస్‌జీటీ వీఎస్ రామారావు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ మేరకు ఎంఈఓలు డీఈఓకు నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో వాకాడ ఎస్‌జీటీ వీఎస్ రామారావుపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎక్కడకు వెళ్లకుండా అందుబాటులో ఉండాలని, ప్రభుత్వపరంగా చెల్లించే అలవెన్సులను నిలుపుదల చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ కూడా దీనిపై విచారణకు చర్యలు చేపట్టారు.

విలేకరి మృతదేహం లభ్యం



షేక్ సలీమ్ (ఫైల్)

సామర్లకోట: గోదావరి కాలువలో ఈ నెల 9న గల్లంతైన పెదపూడి లోకల్ పేపర్ విలేకరి షేక్ సలీమ్(36) మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానిక కాకినాడ రోడ్డులోని సాంబమూర్తి రిజర్వాయర్ ఎదురుగా ఉన్న గోదావరి కాలువలో పోలీసులు ఈ మృతదేహాన్ని గుర్తించారు. ఈ నెల 9న రాత్రి సలీమ్ ఓ మహిళతో వచ్చి, రైల్వే గేటు ఎదురుగా ఉన్న నూతన వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విదితమే. అప్పటి నుంచి పోలీసులు, సలీమ్ బంధువులు గోదావరి కాలువలో గాలింపు చేపట్టారు. కాలువలో మృతదేహం ఉన్న విషయాన్ని తెలుసుకుని సలీమ్ కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారు. ఆ రోజు ధరించిన దుస్తుల ఆధారంగా అది సలీమ్ మృతదేహంగా గుర్తించారు. సంఘటన ప్రదేశం వద్ద సలీమ్ భార్య ఈశ్వరి బోరున విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. వైఎస్సార్ సీపీ పెద్దాపురం మైనార్టీ అధ్యక్షుడు జానీ ఆమెను ఓదార్చారు. సంఘటన సమయంలో సలీమ్‌తో వచ్చిన మహిళకు తన సెల్ ఫోన్, పర్సు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు.



గోదావరి కాలువలో లభ్యమైన సలీమ్ మృతదేహం



మృతదేహం ఉన్న ప్రదేశం వద్ద రోదిస్తున్న సలీమ్ భార్య

లాకులు మూసిఉంటే..

సుమారు 20 రోజుల పాటు కాలువలో మృతదేహం లభించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలువలో దూకిన ప్రదేశం నుంచి లాకులు దాటి మృతదేహం ఎలా చేరిందనే సందేహాలున్నాయి. లాకుల వద్ద గేట్లు ఎనిమిదేళ్లుగా పని చేయడం లేదని అంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



లలితేశ్వరి(ఫైల్)

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో వివాహిత కురుపూడి లలితేశ్వరి(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు, బంధువుల వివరాల మేరకు, స్థానికంగా ఓ సంచుల గోడౌన్లో లలితేశ్వరి గుమస్తాగా పనిచేస్తోంది. బుధవారం తెల్లవారుజామున వాకింగ్ కోసం వీధిలోకి వెళ్లింది. తెల్లవారినా ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో మృతురాలి భర్త రాజు ఆమెకు ఫోన్ చేశాడు. సెల్‌ఫోన్ స్విచాఫ్ రావడంతో బంధువులకు విషయం చెప్పాడు. బంధువులంతా గాలించగా.. ఆమె పని చేస్తున్న సంచుల గోడౌన్లో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ సుధ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించింది. మృతురాలి ముఖంపై గాయాలు, సంఘటన స్థలంలో రక్తపు మరకలు ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.